## క్లుప్తంగా

### పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి


బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీలో సేవలు అందిస్తున్న వైద్యులు

**చాగల్లు:** పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను దూరం చేయవచ్చని బ్రాహ్మణగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.నిషిత అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం రోగులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీరు కలుషితం కావడంతో డయేరియా ప్రబలుతుందని, వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. వైద్యురాలు పీఆర్‌ఎల్ దేవి మాట్లాడుతూ ఈగలు వాలిన, నిల్వ ఉంచిన పదార్థాలను తినరాదన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని వివరించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. వైద్య సిబ్బంది ఎస్.సారమ్మ, సీహెచ్ శ్రీనివాస్, ఎం.రాజశేఖర్, పి.రేవతి తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక స్వావలంబన సాధించాలి


మెప్మా స్టాల్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి, కౌన్సిలర్లు

**కొవ్వూరు:** మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత పథకంతో పాటు సున్నా వడ్డీ రుణాలు అందిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. స్థానికంగా మెప్మా ఆధ్వర్యంలో మహిళలు ఏర్పాటు చేసిన వివిధ వ్యాపారాలకు చెందిన స్టాల్స్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. స్టాల్స్‌ను పరిశీలించి పలు రకాల సామాన్లు కొనుగోలు చేశారు. కౌన్సిలర్లు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, అంకోలు వెంకటలిల్లీ పద్మలీల, దేవగుప్తాపు ఛాందిని, వరిగేటి లలితకుమారి, టౌన్ మిషన్ కోఆర్డినేటర్ జేవీవీఎస్ భవాని, సీఏ సుజాత తదితరులు పాల్గొన్నారు.

### భూముల రీసర్వేతో రైతులకు ప్రయోజనం


కలవలపల్లిలో భూ సర్వే చేస్తున్న అధికారులు

**చాగల్లు:** జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని డిప్యూటీ తహసీల్దార్ కె.ఆనంద్ కుమార్ అన్నారు. కలవలపల్లి, మల్లవరం, మార్కొండపాడు గ్రామాల్లో భూ సర్వేపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోకి సర్వే సిబ్బంది వచ్చే సమయంలో రైతులు అక్కడే ఉండి సక్రమంగా సర్వే చేయించుకోవాలని తెలిపారు. మల్లవరంలో రైతులు శనివారం నుంచి గ్రామ సచివాలయానికి తమ భూహక్కు పత్రాలు సర్వే సిబ్బందికి చూపించి భూమి విస్తీర్ణాలు నిర్ధారించుకోవాలన్నారు. కలవలపల్లిలో రైతులకు నిర్దేశించిన ఆయా తేదీలలో వెళ్లాలన్నారు.

### ట్రిపుల్ ఐటీకి ఇద్దరు ఎంపిక


కె.అనిల్‌కుమార్


ఎస్.తేజస్విని

**తాళ్లపూడి:** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పదో తరగతిలో 573 మార్కులు పొందిన కె.అనిల్‌కుమార్ నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీటు సాధించారు. 561 మార్కులు సాధించిన ఎస్.తేజస్విని ఒంగోలు ట్రిపుల్ ఐటీ కాలేజీలో సీటు పొందారు. ఈ విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ సుబ్బలక్ష్మి, స్కూల్ పేరెంట్స్ కమిటీ సభ్యుడు పి.బంగార్రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

### కేసులను ఎత్తివేయాలి

**నిడదవోలు రూరల్:** ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న ప్రజలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) జిల్లా కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు తెలిపారు. సమిశ్రగూడెంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రజాస్వామిక వాదులపై పెట్టిన ఉపా కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శనివారం విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా జరుగుతుందన్నారు.

# భక్తులకు మెరుగైన సదుపాయాలు


భక్తుల అదనపు గదులను ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

**నిడదవోలు:** భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తిమ్మరాజుపాలెం శ్రీకోటసత్తెమ్మ అమ్మవారి ఆలయంలో రూ.1.90 కోట్లతో నిర్మించిన భక్తుల అదనపు గదులు, ఉచిత భోజనశాల భవనం, మరుగుదొడ్ల సముదాయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, పార్టీ పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు దేవులపల్లి రామసుబ్బరాయశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

**నేటి నుంచి శాకంబరి ఉత్సవాలు**

**నిడదవోలు రూరల్:** గోపవరం గ్రామ గుబ్బాలమ్మ అమ్మవారి దేవస్థానంలో శనివారం నుంచి 17వ తేదీ వరకు శాకంబరీ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు రఘుకుమార్ శర్మ తెలిపారు. శనివారం ఆలయ ప్రదక్షిణం, గణపతి పూజ, పుణ్యాహవచనం, మహాసంకల్పం, శాకంబరీ కలశ స్థాపన, కుంకుమార్చన, అగ్ని ప్రతిష్ఠాపన, లక్ష్మీగణపతి హోమం, 16న కలశార్చన, కుంకుమ పూజలు, చండీ సప్తశతి పారాయణ, మహాలక్ష్మీ హోమాలు, 17న చండీ సప్తశతి హోమాలు, మహాపూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పాలు ఉంటాయన్నారు.

# ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు
- నిడదవోలులో గడప గడపకూ..


లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

**నిడదవోలు:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అన్నారు. స్థానిక 15వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రతి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా అర్హులకు అందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ వార్డుకు వెళ్లినా ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. ఏ పథకం కావాలన్నా వలంటీర్లకు చెబితే వారే దరఖాస్తు చేయిస్తారన్నారు. గత టీడీపీ పాలనలో పథకాలు పొందాలంటే అనేక ఇబ్బందులు పడేవారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రతి హామీని సీఎం జగన్ నెరవేర్చారని తెలిపారు. అనంతరం ప్రజలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేశారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు మొదలవలస నాగమణి, కామిశెట్టి సత్యనారాయణ, ఎస్‌కే వజీరుద్దీన్, కొత్తపల్లి సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్ల అభివృద్ధికి రూ.11 కోట్లు


తానేటి వనిత, హోం మంత్రి

**కొవ్వూరు:** నియోజకవర్గంలో 34 కిలోమీటర్ల పొడవున నాలుగు ఆర్‌అండ్‌బీ రోడ్లను తారురోడ్లుగా అభివృద్ధి చేసేందుకు రూ.11 కోట్లు మంజూరయ్యాయని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత తెలిపారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. మార్టేరు నుంచి ప్రక్కిలంక రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరయ్యాయని అన్నారు. ఉనగట్ల నుంచి కలవపల్లి మీదుగా బ్రాహ్మణగూడెం వరకూ 8.35 కిలోమీటర్ల పొడవున తారు రోడ్డు నిర్మిస్తామన్నారు. చాగల్లు నుంచి అమ్మికుంట మీదుగా చిక్కాలపాలెం రోడ్డును రూ.1.80 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. చిట్యాల నుంచి తిరుగుడుమెట్ట, రావూరుపాడు మీదుగా కుమారదేవం వరకూ రూ.3 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు మంత్రి వివరించారు.

# ఓటర్ల సవరణపై సమావేశం

**తాళ్లపూడి:** ఓటర్ల సవరణపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బూత్ లెవిల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ టి.రాధిక పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ నెల 21 నుంచి ఆగస్టు 31 వరకూ బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాపై సర్వే చేస్తారన్నారు. వారికి తగిన సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. కొత్తగా ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులు చేస్తారన్నారు. సమావేశంలో ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, డీటీ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## వలంటీర్లకు వందనం

### వారికి జీవన‘జ్యోతి’


బొల్లాప్రగడ అనంతం, హరిసుందరి దంపతులు

బొల్లాప్రగడ అనంతం, హరిసుందరి దంపతులు. వారిది శ్రీకాకుళం జిల్లా. పనుల నిమిత్తం సహచరులతో కలసి కోవిడ్‌కు ముందు నల్లజర్ల మండలం ఘంటావారిగూడెం వచ్చారు. ఎక్కడా పని దొరకలేదు. ఇంతలో కరోనా ఉధృతమైంది. ఉండడానికి ఇల్లు, తినడానికి తిండిలేని పరిస్థితి. ఎవరూ దగ్గరకు రానిచ్చేవారు కాదు. అలాంటి సమయంలో ఆ గ్రామ వలంటీర్ ప్రత్తిపాటి జ్యోతి వారిని దేవతలా ఆదుకుంది. చుట్టుపక్కల వారిని అడిగి ఆహారం అందించేది. శివాలయం పుజారి ఫణిబాబు తలదాచుకునేందుకు కాస్త జాగా ఇచ్చారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా తన సొంత హామీపై వలంటీర్ జ్యోతి ఆధార్, బియ్యం కార్డు వచ్చేలా చేసింది. ఆ కార్డుల సాయంతో పింఛను వచ్చే ఏర్పాటు చేసింది. హరిసుందరికి ఈబీసీ నేస్తం ద్వారా ఆర్థిక సాయం అందుతోంది. ప్రస్తుతం ఓ స్కూల్ బస్‌లో సహాయకుడిగా అనంతం పనిచేస్తున్నారు. వారికి ఇంటి స్థలానికి కూడా దరఖాస్తు చేయించింది. త్వరలోనే స్థలం ఇవ్వనున్నారు. అనాథలుగా వచ్చిన వారికి ‘జ్యోతి’లా వెలుగునిచ్చింది.

### సంక్షేమ పథకాలు అందిస్తూ..



ప్రభుత్వం నుంచి ఏ పథకం వచ్చినా వలంటీర్ గుల్లి ఉదయభాను ఇంటికి వచ్చి పూర్తి సమాచారం తెలియజేస్తోంది. అంతేకాకుండా దరఖాస్తు కూడా చేయించింది. సంక్షేమ పథకాలు వచ్చేలా చూస్తుంది. పిల్లలను బడికి పంపితే అమ్మ ఒడి పథకం కింద రూ.15 వేలు వస్తాయని తెలిపింది. మా కుటుంబానికి అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, పెన్షన్ కానుక అందుతుంది. ప్రతి నెలా 1న ఇంటికి వచ్చి మరీ పెన్షన్ సొమ్ము ఇస్తుంది.

–సీంబోతుల వెంకటలక్ష్మి, ప్రక్కిలంక

### సేవే పరమావధిగా...


వలంటీర్ స్వాతి చేతుల మీదుగా ఇంటి పట్టా అందుకుంటున్న ఉష

వలంటీర్లు సేవే పరమావధిగా సేవలు అందిస్తున్నారు. ఊనగట్ల గ్రామానికి చెందిన వలంటీర్ తోర్లపాటి స్వాతి తన పరిధిలో 50 కుటుంబాలకు ఎలాంటి సమస్య వచ్చినా ముందుండి చూసుకుంటుంది. ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయానికే పింఛన్ డబ్బులు లబ్ధిదారుల ఇంటికి తెచ్చి ఇస్తోంది. దీంతోపాటు ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు వివరిస్తూ అర్హులకు అందేలా చూస్తోంది. అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రుల్లో ఉన్నవారికి అక్కడికి వెళ్లి పింఛన్లు ఇస్తుంది. ఒంటరి మహిళ కొండే ఉష కూలి పనులు చేసుకుని జీవిస్తుంది. ఆమెతో వలంటీర్ స్వాతి ఇంటి స్థలానికి దరఖాస్తు చేయించింది. జగనన్న కాలనీలో స్థలం పొందేలా సహకరించింది. - చాగల్లు

### తోబుట్టువులా ఆదుకుంది

నాకు ప్రభుత్వం నుంచి వస్తున్న ఒంటరి మహిళ పింఛన్‌ను వలంటీర్ స్వాతి ఇంటికి తెచ్చి తోబుట్టువులా ఇస్తోంది. ఏఅవసరం వచ్చినా ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ సేవలు అందిస్తోంది. ఇంటి స్థలానికి దరఖాస్తు చేయించింది. నేను అధికారుల చుట్టూ తిరగకుండానే వలంటీరే అన్నీ చూసుకుంది. ఈ ప్రభుత్వంలో వలంటీర్ వ్యవస్థ వచ్చాక అన్ని సమస్యలూ తీరుతున్నాయి.

–కొండే ఉష, ఊనగట్ల, చాగల్లు మండలం

# ఊపందుకున్న వరినాట్లు


పొలంగిలో నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

**ఉండ్రాజవరం:** వర్షాలు పడుతుండడంతో ప్రస్తుతం వరినాట్లు ఊపందుకున్నాయి. రైతులంతా పొలాల బాట పట్టారు. ఈ ఏడాది కాలువలకు ముందుగా నీరు విడుదల చేయడంతో మండలంలో పలుచోట్ల సార్వా సాగు పనులు ప్రారంభమయ్యాయి. బోర్లు, నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో ముందుగానే రైతులు నారుమళ్లు వేశారు. జూన్, జూలై నెలలలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో నాట్లకు కొంతమేర ఆలస్యమైంది. ఇంతవరకూ తక్కువ వర్షపాతం నమోదు కావడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఉండ్రాజవరం మండలంలో మొత్తం 12,610 ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా ఇప్పటివరకూ 50 శాతం నాట్లు పూర్తయినట్లు మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కోటారు సత్యనారాయణ తెలిపారు. ప్రస్తుతం వర్షాలతో ఒకపక్క పంట దమ్ము పనులు చేస్తుండగా, మరోపక్క వరినాట్లు వేస్తూ సాగు పనుల్లో రైతులు బిజీ అయ్యారు. ఇతర ప్రాంతాల నుంచి వలస కూలీలు రావడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ముఖ్యంగా మండలంలో చాలా గ్రామాల్లో బెంగాల్ నుంచి వచ్చిన కూలీలు వరినాట్లు వేస్తున్నారు. బెంగాల్ కూలీలు వరుస క్రమంలో నాట్లు వేయడంతో పాటు కూలి ఖర్చు తక్కువగా ఉండటంతో అధిక శాతం మంది వీరిపైనే ఆధారపడుతున్నారు. మండల వ్యవసాయ అధికారి విశ్వాసరావు మాట్లాడుతూ మండలంలో రైతులు భూసార ఫలితాలను బట్టి ఎరువులు వాడాలన్నారు. రైతులు త్వరగా వరినాట్లు పూర్తి చేయాలన్నారు. అధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు.

### ఈకేవైసీ తప్పనిసరి

**కడియం:** పీఎం కిసాన్ యోజన పథకం లబ్ధి పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతు రుణ అర్హత కార్డులు తీసుకోవాలన్నారు. ఉద్యాన విభాగం ద్వారా అందజేస్తున్న డ్రిప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువులకు రూ.400 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకుంటే బీమా వర్తిస్తుందన్నారు. సమావేశంలో ఏవో కె.ద్వారకాదేవి, హెచ్‌వో డి.సుధీర్ కుమార్, వెటర్నరీ ఏడీ జేఎస్‌ఆర్‌ఆర్ కుమార్, సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

### బీజేపీ మండల సమావేశం

**గోపాలపురం:** స్థానికంగా నియోజకవర్గ బీజేపీ కార్యాయలంలో మండల పార్టీ అధ్యక్షుడు గెల్లా శ్రీనుబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కొండేపాటి రత్నాజీచౌదరి, ఇల్లూరి పెంటలరాజు, వేములపల్లి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### వలంటీర్లపై రాజకీయాలెందుకు: భరత్

**కంబాలచెరువు (రాజమహేంద్రవరం):** ప్రజలకు చిత్తశుద్ధితో సేవలందిస్తున్న వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాజకీయాలు చేయడం తగదని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పవన్ నోటి నుంచి వచ్చే ప్రతిమాటా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు మనసులో మాటేనన్నారు. ‘ఈనాడు’ అందిస్తున్న ఆ స్క్రిప్టుకు ప్రొడ్యూసర్ చంద్రబాబు, యాక్టింగ్ పవన్ అన్నారు. వీరు ముగ్గురూ కలసి వలంటీర్ వ్యవస్థపై గురి పెడుతున్నారన్నారు. ఇటువంటి తాటాకు చప్పుళ్లకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బెదిరేది లేదన్నారు. వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికీ మధ్య వారధిలా విశేషమైన సేవలందిస్తున్నారని, అటువంటి సేవకులను అభినందించకపోగా, అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సమర్థవంతమైన వలంటీర్ల వ్యవస్థ, వారి సేవల కారణంగా రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న మంచి పేరును చూసి, చంద్రబాబు, పవన్ కల్యాణ్ తట్టుకోలేకపోతున్నారన్నారు.

# పేదల కోసమే ‘జగనన్న సురక్ష’

- అందరికీ పథకాల లబ్ధి
- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


దేవరపల్లిలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


ఖండవల్లిలో ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ తదితరులు


సూర్యారావుపాలెంలో ధ్రువపత్రాలు ఇస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు భాస్కరరామయ్య

**దేవరపల్లి:** పేదలందరికీ పథకాల లబ్ధి అందించాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. శుక్రవారం దేవరపల్లి మూడో సచివాలయం వద్ద సర్పంచ్ కడిమి వీరకుమారి అధ్యక్షతన జగనన్న సురక్ష గ్రామసభ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ విద్యార్థులు, రైతులు, మహిళలను దృష్టిలో ఉంచుకుని 11 రకాల ధ్రువపత్రాలను సచివాలయాల వద్ద ఉచితంగా అందజేస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేస్తుందన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో నాబార్డు నిధులు రూ.1.20 కోట్లతో ఆరు గదుల భవనం నిర్మించామని, మరో రూ. 2 కోట్లతో 12 అదనపు తరగతి గదులను నిర్మిస్తున్నట్లు చెప్పారు. 40 ఎకరాల భూమిని కొనుగోలు చేసి 1,600 మంది పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇచ్చామన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, మండల ప్రత్యేక అధికారి జి.రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్, ఉపాధ్యక్షుడు కామిశెట్టి దుర్గారావు పాల్గొన్నారు.

**పెరవలి:** కాపవరం, ఖండవల్లి గ్రామాల్లో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అధ్యక్షతన జగనన్న సురక్ష సభలు నిర్వహించారు. కాపవరంలో 1,051, ఖండవల్లిలో 2,643 మందికి ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంతో ప్రజలకు పాలన మరింత చేరువైందన్నారు. తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి, ఎంపీడీఓ దామోదరరావు, మండల పార్టీ అధ్యక్షుడు వీరమల్లు సత్యనారాయణ, గృహసారథుల మండల అధ్యక్షులు రామడుగుల సూర్యనారాయణ, సర్పంచ్ బంటుమెల్లి రత్నాజీరావు పాల్గొన్నారు.

**ఉండ్రాజవరం:** జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య తెలిపారు. సూర్యారావుపాలెం, మోర్త సచివాలయ వద్ద జగనన్న సురక్ష సభలను నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు ఆలపాటి నరేంద్ర, సర్పంచ్ చిటికెన సుజని, ఎంపీటీసీ సభ్యులు జానీ నాగలక్ష్మి, వి.రాణి, పెదపోలు వెంకటలక్ష్మి, ఎంపీడీవో జి.రామకృష్ణంరాజు, తహసీల్దార్ జి.కనకరాజు పాల్గొన్నారు.

**ప్రజలకు మరింత చేరువ**

**గోపాలపురం:** జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు సేవలు మరింత చేరువవుతున్నాయని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. కరిచర్లగూడెంలో జగనన్న సురక్ష సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. అర్హులందరికీ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమన్నారు. రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, మండల పార్టీ కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మండల మహిళా కన్వీనర్ యండపల్లి కవిత, సర్పంచ్ పఠాన్ అన్సర్ బాషా పాల్గొన్నారు.

**ద్వారకాతిరుమల:** జాజులకుంటలో జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు పలు ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు పథకాల పేరిట దోచుకున్నాయన్నారు. జగనన్న పాలనలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, సర్పంచ్ బత్తుల బేబిశాంతి, ఎంపీటీసీ వసంతాటి లక్ష్మి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బలుమూరి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.


**కొవ్వూరు:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు) తెలిపారు. వాడపల్లి–1, 2 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో కె.సుశీల, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, సర్పంచ్ గెల్లా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**నిడదవోలు:** ప్రజలకు ప్రభుత్వ సేవలను ఉచితంగా అందించడానికి ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి అన్నారు. స్థానిక బసివిరెడ్డిపేట సచివాలయంలో జగనన్న సురక్ష సభ నిర్వహించారు. 750 మందికి కుల ధ్రువీకరణ పత్రాలు, 780 ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జగనన్న సురక్ష కోఆర్డినేటర్ ఎస్‌కే ఖాన్‌బాషా, కౌన్సిలర్ మేడపాటి సరిత తదితరులు పాల్గొన్నారు.

### పనిభారం తగ్గించాలి

**నల్లజర్ల:** పీహెచ్‌సీల్లో పనిచేసే స్టాఫ్ నర్సులపై పనిభారం తగ్గించాలని ఏలూరు జిల్లా స్టాఫ్ నర్సుల అసోసియేషన్ అధ్యక్షురాలు వి.వెంకటలక్ష్మి అన్నారు. శుక్రవారం నల్లజర్లలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. పీహెచ్‌సీల్లో రాత్రి షిఫ్టులలో వచ్చే అన్ని సీరియస్ కేసులను స్టాఫ్‌నర్సులే చూడాల్సి వస్తుందన్నారు. డాక్టర్‌తో పాటు మిగిలిన సిబ్బంది ఆదివారాలు ఉండరని, ఒక్క స్టాఫ్ నర్సులే డ్యూటీలో ఉంటారన్నారు. ఆదేరోజు సీరియస్ కేసులు వస్తుండడంతో పనిభారం పెరుగుతుందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలన్నారు.

# పురుగు మందుల దుకాణంపై దాడి


పంగిడిగూడెంలో ఎరువులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

**ద్వారకాతిరుమల:** పంగిడిగూడెంలో లక్ష్మీ ట్రేడర్స్ పురుగు మందుల దుకాణంపై రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా దాడి చేశారు. ఎరువుల గోదాములో ఉండాల్సిన స్టాకు కంటే తక్కువ స్టాక్ ఉన్నట్టు గుర్తించారు. దీంతో రూ. 1,27,400 విలువైన ఎరువులను సీజ్ చేసి, 6ఏ కింద కేసు నమోదు చేశారు. ఎరువులు, పురుగు మందుల డీలర్లు నిషేధిత కలుపు మందు అమ్మకాలు జరిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని విజిలెన్స్ ఎస్సై సీహెచ్ రంజిత్‌కుమార్ హెచ్చరించారు. ఈ దాడిలో మండల వ్యవసాయాధికారి దుర్గారమేష్, వీఆర్వో చంద్రలీల, వీహెచ్‌ఏ దీప్తి తదితరులు పాల్గొన్నారు.


చెరుకుమిల్లిలో నీట మునిగిన వరి చేలు

# వానొచ్చి.. ముంచేసి..

**గోపాలపురం:** వర్షాలకు గోపాలపురం మండలం చెరుకుమిల్లి, వెంకటాయపాలెం గ్రామాల్లోని వరి పొలాలు నీట మునిగాయి. వీటిని శుక్రవారం మండల వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు కొవ్వాడ కాలువ ఉధృతంగా ప్రవహించడంతో వరి చేలు నీట మునిగినట్లు మండల వ్యవసాయాధికారి బి.రాజారావు చెప్పారు. పొలాల్లో నీరు పోయేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచనలు చేశారు. మరో మూడు రోజులు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది.